# నన్ను క్షమించవూ

సాయంకాలం అయిదు గంటలయింది.

ఆఫీసు కొచ్చేదాకా ఒక హడావుడి.

అయిదయిందంటె మరో హడావుడి, ఆందోళన-కంగారు...అలస్యంగా ఇంటికి చేరితే భర్తకు కోపం. పట్టరాని కోపం?- ఆఫీసు మానేయమంటాడు. అదంతా పైకే! ఆఫీసు మానేసే అవకాశమే వుంటే తానెందుకు వస్తుంది!— ఈ మానసిక ఆందోళనను, ఆవేదనను తలకెందుకు ఎత్తుకుంటుంది!

అత్తమావల పరిచర్యలు. పాప ఆలనా పాలనా..-అయిదు తరువాత అందంగా ముస్తాబై ఆయనకోసం ఎదురుచూపులు—

ప్చ్! నిట్టూర్చింది వందన!

తనకు మాత్రం ఆ జీవితం కావాలని లేదూ!

వందన భర్త ముత్యాలరావుకు ఒక ప్రైవేట్ కంపెనీలో వుద్యోగం— నెలకు ఏడు వందల జీతం ఫిక్స్‌డ్-అన్నీ దాంట్లోనే అదైనా నెలనెలా అందు తుందన్న గ్యారంటీ లేదు. అసలా వుద్యోగానికే గ్యారంటి లేదు.

దేశంలో దేనికి గ్యారంటీ వుంది కనుక! అత్యవసరాలైన నీటికి, మంచి గాలికే గ్యారంటీలేదు. ప్రైవేట్ సంస్థల్లో వుద్యోగాల గ్యారంటి ఎవరికి పట్టింది? కావాలని ఏ మేకా కసాయికత్తి కింద మెడ పెట్టదు. పరిస్థితులు లాక్కుపోతే తప ప్రైవేట్ సంస్థల్లో వుద్యోగాలూ అంతే!

ప్రభుత్వ సంస్థల్లో మాత్రం పరిస్థితులు మూడు పూవులు ఆరుకాయలా? అంటే అక్కడ చట్ట బద్ధమైన దోపిడి!

అత్త, మామ, భర్త, పాప, తను...అయిదుగురుకి ఏడొందల జీతం ఏ మూలకు! ఇంటి అద్దె మూడువందలపైన. పైగా పెరుగుతున్న పాప, పెరుగుతున్న ధరలు!!

మన పూర్వీకులు ఎంత అమాయకులో, జీవితానందాన్ని సంపూర్ణంగా అనుభవించిన వాళ్ళై అయివుండాలి. అందుకే నరకం ఎక్కడో వుందన్నారు మనకు మాత్రం అడుగడుగునా నరకమే.

ఏ కాస్త నవ్వునైనా జీవితాల్లో మిగిల్చేనా ఈ నరకం! ఓ అందమైన సాయంకాలాన్నో, వెన్నెల రాత్రినో చూసి వుప్పొంగే మనసులు రోజు రోజుకు ఎంత దూరమైపోతున్నాయి!

తానూ వుద్యోగం చేయడం తప్పలేదు వందనకు. జీవితంలోనేకాదు భర్త బాధ్యతల్లోనూ భాగం పంచుకుంటున్నందుకు ఆమెకు ఆనందంగా వుంది-

అయిదేళ్లు శ్రమపడితే ఓ వంద గజాల జాగా దొరక్కపోతుందా? ఆ తరువాత సొంత ఇంటి కోసం పరుగు.... అవిశ్రాంతమైన పరుగు.... ఇంటికి ఒక్కమెట్టు వేసుకోవాలంటే తమలాంటి బతుకులు ఎన్ని చెమట బిందువుల్ని రాల్చాలి!!

ఒక్క విశ్వామిత్రుని ఎదుర్కోడానికే సత్యహరిశ్చంద్రుడు అన్ని కష్టాలు పడ్డాడు. పొద్దున లేచింది మొదలు మామూలు మనిషి ఎందరు విశ్వామిత్రుల్ని ఎదుర్కోవాలి! ఎన్ని పంజాల్ని తప్పించుకోవాలి! ఎన్నెన్ని చేతుల్లో పావై ఆడాలి.

అయిదు పదిహేను గుండె ఆగినంత పనయింది వందనకు. ఆఫీసు నుంచి ఇక బయటపడాలి. తీరా బయలుదేరే సమయానికి-"ఈ ఒక్క లెటర్ టైపు చేసి" అని కబురు—

"ఎన్ని గంటలకే నువ్వు ఇంటికివచ్చేది?" కోపంలో మర్యాదల్ని మరచిపోతాడు ముత్యాలరావు. అతడు మర్యాదల్ని పాటించడం లేదనికాదు వందన ఆవేదన-అతనికి కోపం తెప్పించానే అని ఆమె విల విల్లాడిపోతుంది.

"ఇప్పుడు టైమెంత?" ఉరుము-కళ్ళలో రక్తం.

"ఏడు..." బెదురు బెదురుగా అంది వందన.

"అయిదు గంటలకు ఆఫీసు వొదిలి - ఎక్కడెక్కడో తిరిగి ఇప్పుడు ఇంటికొస్తావా?..." ఆ తరువాత మాట వినలేక చెవులు మూసుకుంది,

తనకు మాత్రం ఇంటికి తొందరగా రావాలని వుండదూ !... పొద్దున తొమ్మిది గంటలకు ఇంట్లో వొదిలి వచ్చే పాపకోసం తన గుండెలు తల్ల డిల్లవూ ! మనసు ఆరాట పడదూ ! పక్షికే వున్నాయి కాని రెక్కలు ప్రతి తల్లికి వుండాలి. ముఖ్యంగా బిడ్డలకు దూరంగా వెళ్ళి పనులు చేసే తల్లులకు.

దొరకక విసిగించే బస్సు రాక్షసికి వేగిరం ఇల్లు చేరి బిడ్డలను గుండెలకు హత్తుకోవాలనే తల్లుల ఆరాటం అర్థంకాదు. ఆటోలు,రిక్షాలు రోజూ కావాలంటే నెల జీతం వాటికే సరిపోదు.

భర్తకో స్కూటర్... తనను ఆఫీస్‌లో డ్రాపింగ్... వచ్చేప్పుడు పికప్... ఇంకా చాలా దూరం ప్రస్తుతానికి వూహకే అందనంత దూరం! ఆ అట్టడుగు మధ్య తరగతికి, బస్సు రాక్షసి తప్ప దూరాలను దాటించే మరో మార్గం లేదు,

"బస్సు దొరకలేదండీ..."

"ఇంత సేపు బస్సు దొరకలేదా?..."

"అవునండి..."

"నోర్మూయ్...నీ దొంగ నాటకాలు నాదగ్గర కాదు..." బెదిరిపోయింది వందన.

తాను ఇంటికి తొందరగా రావడమో, ఆలస్యంగా రావడమో బస్సు చేతిలో వుంది. తన చేతిలో ఏమీలేదు.

"ఇదే ఆఖరిసారిగా వార్నింగ్ ఇస్తున్నా - ఆరున్నరవరకు ఇంట్లో ఉండాలి."

"... ... ..."

"మాట్లాడవేం... గద్దించి అడిగాడు ముత్యాల్రావు.

"అలాగే" తలూపింది వందన.

"అలాగే అని వూర్కోడం కాదు. మాటంటే మాటే., రేపట్నించి ఆరున్నరకల్లా ఇంట్లో వుండకపోయావో నీ మొహం చూడను-అంతే.."

మౌనంగా అతని వంక చూడటం తప్ప ఇంకేం మాట్లాడగలదు. ఏ విషయం లోనైనా అతనికి లోటు రానిచ్చిందా! అతడు చెప్పిన టైంకు ఇంటికి రాక ఆలస్యం చేయాలని తనకెందుకుంటుంది? ఆ విషయం అతనికి అర్థమయ్యే దెలా?

ఆఫీసు నుంచి బయటికి దూకడానికి మరో పావుగంట పట్టింది. అప్పటికే సమయం అయిదున్నర! ఇంకో గంటలో లక్డీకాపూల్ నుంచి రాంనగర్ చేరుకోవాలి. అందుబాటులో వాహనం వుండాలి కాని అదేమంత దూరం కాదు. గంట అవసరంలేదు. నిమిషాలు చాలు ఇల్లు చేరడానికి.

ఫుల్ లోడ్‌లో వచ్చిన ఒక బస్సు స్టాప్‌లో ఆగకుండానే వెళ్ళిపోయింది. దానికేం తెలుసు వందన అనే ఇల్లాలు శర్త పెట్టిన గడువులో ఇల్లు చేరాలని ఆరాటపడుతోందని.

పావు తక్కువ ఆరు!

వందన గుండె వేగంగా కొట్టుకుంటోంది.

ముత్యాల్రావుతో పెళ్ళికి ముందే నాలుగేళ్ళ పరిచయం. తామిద్దరు ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. తమది ఆదర్శ వివాహం అంటారు తెలిసినవాళ్ళంతా-ఆదర్శ కాపురం కూడా కావాలని ఆమె ఆరాటం. ఎన్నడూ భర్తకు తనవల్ల ఇబ్బంది కలగకూడదని- అతని సుఖాల్లోనే కాదు కష్టాల్లో సమానంగా పాలువంచుకోవాలని ఆమె తాపత్రయం.

ఎంత ప్రేమించి పెళ్లిచేసుకున్నా తన భర్తా మగవాడే! మగాళ్లకుండే మామూలు బుద్ధిని పోనిచ్చాడు కాదు. అనుమానం ముందు పుట్టి మగాడు తరువాత పుట్టాడేమో! ఆఫీసు నుంచి ఇంటికి లేటుగా వెళ్తె ఎంత అనుమానం!

'నేనెలా చెప్పేది నువ్వే నా ప్రాణమని...నువ్వు తప్ప ప్రపంచంలో నాకింకేమీ అక్కర్లేదని' నే...నేం చేస్తున్నా నీకోసమేనని... నువ్వవద్దంటే వూపిరి కూడా పీల్చటం మానేస్తానని... ఉద్వేగంగా ఆలోచించసాగింది వందన.

'ఎందుకంత కఠినంగా మాట్లాడావ్. . . ఎందుకు నా గుండెను గాయం చేస్తున్నావ్!'

ఆరు!

గుండె వేగంగా కొట్టుకోవడంకాదు- ఆగినంత పనయింది. ఇప్పుడు బస్సు వొచ్చి స్టేజ్‌లో ఆగినా- ఆగిన బస్సును ఇంత జనంలో తాను ఎక్కగలిగినా అరగంటలో ఇంటికి చేరలేదు-

'ఆరున్నరవరకు ఇల్లు చేరక పోయావో. . . నీ మొహం చూడను. . . నీ మొహం చూడను నీ మొహం చూడను. . .'

నిజమే మరి - ఆయనా అలసిపోయి వస్తారు-ఇంట్లో తాను లేకపోయేసరికి మనసు చివుక్కుమంటుంది కాబోలు-తానే బాత్‌రూంలో నీళ్ల తోడుకొని తువ్వాలు కూడా వేసుకొని స్నానం చేయటం కష్టమే- ఆయన కోపంలో న్యాయం వుంది-

అతనిమీది ప్రేమ వందనను అలా ఆలోచింపజేస్తున్నది-

"ఆటో . . . . ."

ఆగలేదు—

మరో "ఆటో. . . , . ."-

ఆగింది- కాని ఎవరో ఎక్కేశారు- ఎవరి తొందర వారిది-

ఆరు పది-

"ఆటో ..,.. ఆటో"

జనంలోంచి దాదాపు పరుగెత్తి ఆటో అందుకుంది వందన - ఎక్కడికి పోవాలో చెప్పకనే ముందు ఆటోలోకి వురికింది- అప్పుడు చెప్పింది-

"రాంనగర్-"

ఆటోకదిలింది-

హమ్మయ్య !

పరిస్థితులు అనుకూలిస్తే ఇరవై నిమిషాల్లో ఇల్లు చేరుకుంటుంది- సెక్రటేరియట్ తెలుగుతల్లి విగ్రహం హుస్సేన్‌సాగర్ అంబేద్కర్ విగ్రహం లోయర్‌టాంక్‌బండ్, ఇందిరాపార్కు, ఆర్టీసి క్రాస్‌రోడ్స్, అక్కడ వచ్చింది చిక్కు

చుట్టూ ఎనిమిది థియేటర్లు-అప్పుడే సినిమాలు వొదిలినట్టున్నారు- ఎక్కడి ట్రాఫిక్ అక్కడ స్తంభించిపోయింది- ఈ రోడ్లు ఎందుకింత ఇరుకు? ఇక్కడ ఎనిమిది థియేటర్లకు అనుమతి ఎలా వచ్చింది ? ఇబ్బంది పెట్టే కట్టడాలు ఎలా లేస్తున్నాయి ? నిలదీసి అడిగితే రాజకీయ పునాదులు కదులుతాయి-

ప్రయాణీకులకు సరిపోయేన్ని బస్సులెందుకు లేవు? రద్దీ ఎక్కువట- సిటీకి సర్క్యులర్ రైల్వే ట్రాక్ ఎందుకురాదు?

ఆరు ఇరవై ఐదు-

"పక్కనుంచి దారిలేదా?" ప్రాధేయపడుతూ అడిగింది వందన-

ఆటోవాలా ఇంజన్ ఆపి-కిందికిలాగి తాపీగా సిగరెట్ తాగుతునారు-

"లేదమ్మా- వుంటె నేనెందుకు ఆగుదును?"

ఆ మాటా నిజమే-

ముందు చక్రంపట్టే జాగావుంటె చాలు-ఆటోను దూసుకపోనివ్వడమే

కర్ణకఠోరంగా ట్రాఫిక్ పోలీస్ విజిల్స్ !

క్షణక్షణానికి వందన గుండెవేగం హెచ్చుతున్నది-

అరున్నర !!!

ఇక గడియారం వంక చూడలేకపోయింది-

"నీ మొహం చూడను..." అన్న భర్త మొహమే ఆమె కళ్ళలో కదులుతోంది- టపటప బుగ్గలమీదికి కన్నీళ్లు దూకాయి- "నన్ను క్షమించు ప్రియతమా... ఇది నేను కావాలని చేసిన ఆలస్యం కాదు... దయచేసి నన్ను అర్థం చేసుకోవూ...నువ్వు చెప్పినటైంకు రాలేదని కోపగించుకోవుకదూ? ..." ఆమె హృదయం మూగగా రోదించింది-

అరునలభై

ఆటో కొంచెం ముందుకు కదిలిందోలేదో... ఏదో పోట్లాట ! ఆర్టీసీ బస్సు ఓ ఆటోకు ఆనిందట- ఆటోవాలా బస్సుడ్రైవర్ గల్లా పట్టుకున్నంత పని చేశాడు-బూతులు తిట్టాడు-గవర్నమెంటు వుద్యోగినైన తనను ఆఫ్టరాల్ ఓ ఆటోవాడు ఇన్ని మాటలంటాడా !!

ఆ బస్ డ్రైవర్ కు సపోర్టుగా అటు బస్సులు ఆగాయి- ఆటోవాలాకు సపోర్టుగా ఇటు ఆటోలు ఆగాయి-వాళ్ళను కన్నపాపానికి ఒకరి తల్లిని ఒకరు తిట్టుకోసాగారు అందరూ కలసి ఏదైన ఆర్థిక, సామాజిక, రాజకీయ దౌర్జన్యాన్ని ఎదిరిస్తున్నారా! అబ్బే వాళ్ళలో వాళ్ళకే పోట్లాట !!

"ఆటో నడవదమ్మా..."

డబ్బులిచ్చి—ఆటో దిగింది వందన-

ఏడుంబావు !

గుమికూడిన జన తటాకాన్ని ఈదుకుంటూ.. అడ్డదిడ్డంగా ఆగిన ఆటోలను, బస్సులను దాటుకుంటూ సంధ్య థియేటర్ చేరడానికి పదినిమిషాలు పట్టింది-

మామూలుగానైతె రూపాయిన్నర- అప్పుడు కాబట్టి మూడు రూపాయలు- అయినా ఫరవాలేదని రిక్షా మాట్లాడుకొని కూర్చుంది-

రాంనగర్ వైపు రిక్షా కదులుతున్నది-

ఇల్లు దగ్గరవుతున్న కొలది గుండెనిండా భయం పేరుకుపోతున్నది-ఒళ్లు చల్లబడుతున్నది-గొంతుదాటి మాటరాక గుండెలోకి జారిపోతున్నది.

రిక్షా ఆపు అనడానికి ఎంతో ప్రయత్నం మీద మాటవచ్చింది.

ఇంటికి కొంచెం దూరంలో రిక్షా ఆపించి డబ్బులిచ్చి.. తడబడే అడుగులతో ఇంటికేసి నడుస్తున్నది-తప్పనిసరిగా భర్తచెప్పిన టైంకు ఇంటికి చేరుకోవాలన్న రోజే మరింత ఆలస్యం-సమయం ఏడున్నర...!!

ఎన్ని మాటలు శూలాల్లా, తూటాల్లా తనకోసం కాచుకొని వున్నాయో-భర్త ఆగ్రహాన్ని ఆగ్రహంలో అతని మొహాన్ని చూడలేక గడపలో కాలు పెడుతుంటే ఆమె గుండె వణికింది- పిడుగు మీద పడమన్నదని ముందే తెలిస్తే ఎంత దుఃఖం! తలెత్తి చూడలేకపోయింది-

వినబోయే మాటలు అప్పటికే చెవుల్లోదూరి ఆమెను కలవరపెట్టి గుండెను కలచివేస్తున్నాయి,

అత్తమామల పలకరింపులుగాని, పాప ఏడ్పుగాని ఆమెకు వినిపించలేదు-

'నన్ను క్షమించవూ...ప్లీజ్ నన్ను క్షమించవూ...ఈ ఒక్క విషయంలో నన్ను క్షమించవూ....' మూగగా ఆమె మనసు రోదిస్తూ భర్తచుట్టూ తిరుగుతున్నది-

ఎదురుగా భర్త!...

భయంతో ఆమె వణికిపోయింది-

బుగ్గలమీదికి కన్నీళ్లు దూకాయి-

"బస్సు...బస్సు దొరకలేదు—" ఆమె గొంతు దుఃఖంతో కప్పనపోయింది-

"ఆటో—క్రాస్‌రోడ్ దగ్గర ఆగిపోయింది- ట్రాఫిక్ జామ్..."

వెక్కి వెక్కి ఏడ్వసాగింది వందన-

ముత్యాలరావు దగ్గరగావచ్చి-"నాకు తెలుసు-అక్కణ్నుంచే వచ్చాను-" అన్నాడు- "నువ్వు నాకు కనిపించలేదు..." అన్నాడు-

వందన గుండెమీదినుంచి ఒక్క సారిగా పెద్ద బండను తొలగించి నట్లయింది-

తన చెవులను తానే నమ్మలేక తలెత్తి చూసింది-

అమె కన్నీళ్ళను తుడుస్తూ-

"నన్ను క్షమించు వందనా... తప్పు నీదికాదు...ఈ సంక్లిష్ట సమాజానిది అని తెలిసి కూడ మూర్ఖంగా ప్రవర్తించాను నీ మనసు గాయపరిచాను నన్ను క్షమించవూ?..." అర్థింపుగా అన్నాడు ముత్యాలావు-

ఆ నిజాన్ని భరించలేక వందన వుక్కిరి బిక్కిరై లడికళ్ళతో భర్త వంక చూసింది...

[ అభ్యుదయ సెప్టెంబర్ 1987 ]